బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దుండిగల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా చెత్త సేకరణ ఆటోరిక్షాలకు అందజేయాలని దుండిగల్ మున్సిపల్ స్పెషల్ అధికారి సాయినాథ్ అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం డీ పోచంపల్లిలోని బస్తీ దవాఖానాలో శానిటరీ వర్కర్లకు హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. అనంతరం వీధుల్లో తిరుగుతూ చెత్త విషయమై అవగాహన కల్పించారు. వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ లైన్లను శుభ్రపరచడం, దోమల వ్యాప్తిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ మొక్కలు నాటాలని, మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి పబ్లిక్ టాయిలెట్లు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, మున్సిపల్ ఇంజినీర్ సురేందర్ నాయక్, ఎన్విరాన్మెంట్ ఇంజినీర్ సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు, మెప్మా మహిళ గ్రూప్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా గొర్రెపొట్టేళ్ల అమ్మకాలు

రంగారెడ్డినగర్: బక్రీద్‌ను పురస్కరించుకుని గొర్రెపొట్టేల అమ్మకాలు జోరందుకున్నాయి. కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తా, హెచ్ఎంటీ ఖాళీ ప్రదేశం, జగద్గిరిగుట్ట, గండిమైసమ్మ తదితర ప్రాంతాల్లో సంగారెడ్డి, మెదక్ జిల్లాల నుంచి తీసుకువచ్చిన గొర్రెల పొట్టేళ్లను కొనుగోలు చేశారు. ఒక్కో పొట్టేలు రూ.15 వేలు మొదలుకుని జాతిని బట్టి రూ.30 వేల వరకు ధర పలికాయి.

మార్కెట్లు కిటకిట

సుభాష్‌నగర్: బక్రీద్ పండుగ షాపింగ్ నేపథ్యంలో షాపూర్‌నగర్ మార్కెట్ రోడ్డు కిక్కిరిసిపోయింది. శనివారం బక్రీద్ పండుగ ఉన్న సందర్భంగా ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ముస్లింలు పెద్ద ఎత్తున కుటుంబ సమేతంగా తరలివచ్చి కొనుగోలు చేయడంతో రాత్రి వరకు ఆ రోడ్డు రద్దీ ఏర్పడింది.



నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ మహా నగర్ ఎస్టేట్స్‌లో రూ.11 లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ జిమ్, పార్కును శుక్రవారం ఆయన కార్పొరేటర్ తారాచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పిల్లలకు ఆటవిడుపుగా, పెద్దలకు శారీరక, మానసిక ప్రశాంతత చేకూర్చడంలో పార్కులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్‌లోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, పార్కులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మహానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నార్లకంటి కుమార్, ఉపాధ్యక్షులు రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంకట్ రెడ్డి, కోశాధికారి ఎస్.ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి

బీటీ రోడ్డు ప్రారంభం

రుక్మిణి ఎస్టేట్స్‌లో రూ.41.50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే వివేకానంద్ అందుబాటులోకి తీసుకువచ్చారు. జీడిమెట్ల డివిజన్‌తో పాటు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రాధాన్యత క్రమంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రుక్మిణి ఎస్టేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖర్, కాలనీ వాసులు నర్సింహులు, శంకర్ రెడ్డి, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాట పోస్టర్ ఆవిష్కరణ

రంగారెడ్డినగర్: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి వసతులతో విద్యను అందిస్తున్నామని గిరినగర్ మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌ప్రకాష్ అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో గ్రామసభ నిర్వహించి బడిబాట పోస్టర్‌ను సామాజిక వేత్త ఉదయ్ గంజితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరినగర్ ప్రభుత్వ పాఠశాల కొత్త భవనంలో సరికొత్త హంగులతో అందుబాటులోకి రానుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి వారి బంగారు భవితకు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సుపర్ణ, రిటైర్డ్ హెడ్ మాస్టర్ వెంకటేశ్వరరావు, స్థానికులు బాల నర్సయ్య, శ్రీనివాస్, శ్యామల, యశ్వంత్, పింటు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హెచ్ఎం విజయ్‌ప్రకాష్, సామాజికవేత్త ఉదయ్ గంజి

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్: గాజులరామారంలోని సర్వే నెంబర్ 326, 307లలో కొంతకాలంగా ఆగిన కబ్జాలు జోరందుకున్నాయని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. కబ్జాదారులపై కేసులు పెట్టి జైలుకు పంపాలని కోరుతూ శుక్రవారం ఆర్ఐ కరీముల్లాకు వినతిపత్రం అందజేశారు. చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, నాయకులు నర్సింహారెడ్డి, రవి, సుంకిరెడ్డి, సామెల్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు

చింతల్: వివేకానందనగర్‌లోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ చింతల్ డివిజన్ అధ్యక్షుడు రాజేష్ చారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం కన్వీనర్ మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి సంతోష్ గుప్తా, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు పొందాలి

కుత్బుల్లాపూర్: సకాలంలో టాక్స్‌ల, ట్రేడ్ లైసెన్స్‌లను చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మున్సిపల్ పరిధిలోని దుకాణదారులు, వ్యాపార సముదాయాల నిర్వాహకులకు ట్రేడ్ లైసెన్స్‌ల విషయమై సూచనలు చేశారు. పాత లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలని, కొత్తవారు లైసెన్స్‌లు పొందేందుకు దరఖాస్తు చేసుకుని రుసుం చెల్లించాలని కమిషనర్ సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



పనులు ప్రారంభిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో ముస్లిం మైనార్టీ ఖబ్రస్తాన్‌లో నీటి సమస్య, రాజీవ్ గాంధీనగర్‌లో డ్రైనేజీ సమస్యలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బస్తీ వాసులు ఆయనను సంప్రదించారు. వెంటనే స్పందించిన ఆయన సదురు కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. శుక్రవారం కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా బోర్‌వెల్, డ్రైనేజీ పనులను స్థానికులతో కలిసి హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ఎస్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు సాయిరాజు, శ్రీనివాస్, సంజీవరెడ్డి, ఎర్రోళ్ల విష్ణు, సన్నీ, విజయ్, అలీ, ఫరీద్, మజీద్, షకీల్, సురేష్, భూమిరాజ్ పాల్గొన్నారు.

మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ

సుభాష్‌నగర్: మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఉప కమిషనర్ నరసింహ అన్నారు. బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా జీహెచ్ఎంసీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకురాలు లావణ్యగౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు పురుషులకు దీటుగా రాణించాలన్నారు. అదేవిధంగా కళాశాలలోని విద్యార్థులకు సరసమైన ధరలకే నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ హరిప్రియ, గాజులరామారం సర్కిల్ పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు దేవ కరుణ, వనిత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఉప కమిషనర్ నరసింహ

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యార్థులు

దుండిగల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులతో పోటీపడేలా తీర్చిదిద్దుతున్నామని భౌరంపేట్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో జరిగిన బడిబాట కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పుస్తకాలను, ఉచిత యూనిఫామ్స్ పంపిణీతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా ఉచితంగా అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందచేసే అన్ని రకాల వసతులను తెలియజెప్పడమే బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రభావతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా భవనం పనులు పూర్తి చేయాలి

రంగారెడ్డినగర్: మహిళా భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వెంకట్‌రామ్‌రెడ్డినగర్ మహిళా భవనాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నిధులతో పక్కా భవన నిర్మాణం జరిగిందన్నారు. డివిజన్ పరిధిలోని గాంధీనగర్, చెన్నారెడ్డినగర్‌లలో నిలిచిపోయిన మహిళా భవనాలను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు సతీశ్ గట్టోజి, మహ్మద్ రషీద్, బీఆర్ఎస్ డివిజన్ ఇన్‌చార్జి కార్తిక్‌గౌడ్, బస్తీ నాయకులు సంతోష్ గౌడ్, కనకరాజు, తేజ యాదవ్, సోమరాజు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన కుత్బుల్లాపూర్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ విజయవర్ధన్ కథనం ప్రకారం.. శుక్రవారం సుమారు 7 గంటల సమయంలో పేట్ బషీరాబాద్‌లోని మధురం టిఫిన్ సెంటర్ ఎదురుగా ఉన్న రోడ్డు డివైడర్ మధ్యలోని చెట్ల పొదల్లో గుర్తు తెలియని కుళ్లిపోయిన మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం వచ్చింది. పోలీసులు వెళ్లి చూడగా పురుషుడి మృతదేహం ఉంది. సుమారు 20 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని పోలీసులు భావించారు. నీలి రంగు టీషర్ట్‌పై అగర్వాల్ వాటర్ ట్యాంక్స్ కంపెనీ పేరు ఉంది. బ్లాక్ కలర్ ప్యాంట్ అగర్వాల్ కంపెనీకి సంబంధించి ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం

చింతల్: భగత్‌సింగ్ నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సం శుక్రవారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 5 గంటలకు అమ్మవారికి అభిషేకం, అలంకరణ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 గంటలకు ఊరేగింపు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలను హనుమంతరెడ్డి, రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయ శేఖర్‌గౌడ్, కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ అధ్యక్షుడు అల్లాబకాష్, దేవాలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి సాంబయ్య, కమిటీ సభ్యులు సామ్రాట్, తిరుపతి ప్రభాకర్, చందు, పంగ రాజు, మూర్తి, నాగబాబు, సుభాష్, వెంకటేష్ పాల్గొన్నారు.